విజయనగరం కీర్తిని పెంచేలా

అమ్మవారి పండగ నిర్వహించాలి

రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : అక్టోబర్ నెల 6, 7 తేదీలలో జరగబోయే శ్రీ శ్రీ పైడితల్లి అమ్మ వారి ఉత్సవాలు భక్తుల్లో మధురానుభూతిని కలిగించేలా నిర్వహించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆహ్లాదకర వాతావరణం లో వేడుకలు జరగాలని, గత ఏడాది కంటే గొప్పగా నిర్వహించాలని తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తో కలసి పైడితల్లి అమ్మవారి ఉత్సవాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఏడాది అధికారులు, పోలీస్‌లు, ప్రజల సహకారం తో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించుకున్నామని, ఈ ఏడాది అంతకన్నా గొప్పగా నిర్వహించాలని తెలిపారు. ఉత్సవాలకు వారం రోజుల ముందు నుండే నగరమంతా విద్యుత్ కాంతులతో అలంకరించాలని, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. సిరిమాను ఊరేగింపు 3 గంటలకే మొదలు పెట్టాలని, 5 గంటలకు ముగించేయాలని అన్నారు. ఉత్సవాలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం గావించాలని సమాచార శాఖ అధికారులకు సూచించారు. పండగ వాతావరణం ఉట్టి పడేలా చూడాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ శాఖల వారీగా ఎవరెవరు ఏఏ పనులు చేయాలో ఆదేశించారు. సాధారణ దర్శనాలకు ఇబ్బంది కలగకుండా విఐపి దర్శనాలను ఏర్పాటుచేయాలనీ దేవాలయ అధికారులకు ఆదేశించారు. ప్రసాదాల నాణ్యంగా ఉండాలని, కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేయాలని, మెడికల్ క్యాంపు, 108 వాహనం కూడా ఏర్పాటుచేయాలనీ తెలిపారు. సి సి కెమెరాలను ఏర్పాటు చేయాలనీ, మూడు రోజుల ముందు నుండే పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలని, తాగు నీటి సరఫరా చేయాలనీ ఆయా అధికారులకు ఆదేశించారు. రథం ఫిట్నెస్ ను అటవీ అధికారులు తనిఖీ చేయాలనీ, ఆర్.డి.ఓ అటవీ అధికారులు సమన్వయం తో పని చేయాలనీ ఆదేశించారు. భక్తులు వచ్చే రూట్లలో బస్సుల సంఖ్య పెంచాలని, తెప్పోత్సవం దగ్గర గజ ఈతగాళ్ళను ఏర్పాటు చేయాలనీ మత్స్య శాఖ అధికారులకు ఆదేశించారు. ఉత్సవాలకై ప్రభుత్వం 50 లక్షలు కేటాయించిందని, నిధులు విడుదల కోసం డి.ఓ లేఖ రాయడం జరిగిందని తెలిపారు. విజయనగరం శాసన సభ్యులు అదితి విజయలక్ష్మి మాట్లాడుతూ సమన్వయం తో పనిచేసి పండగ ను విజయవంతం చేయాలనీ తెలిపారు. వివిఐపి లకు తప్ప గర్భ గుడిలోనికి మగిలిన వారిని అనుమతించరాదని తెలిపారు. జిల్లా ఎస్.పి వకుల్ జిందాల్ మాట్లా డుతూ అమ్మవారి ఉత్సవాల కోసం 2 వేల మంది పోలీస్ లను నియమించడం జరుగతుందని, ముఖ్య కూడళ్ళ లో సిసి కెమెరాల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జే.సి సేతు మాధవన్, డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి, డిసిఎం ఎస్ చైర్మన్ గొంప కృష్ణ, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ శిరీష, ప్రధాన పూజారి బంటుపల్లి వెంకట రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పైడితల్లి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు.

పేదల కాలనీల్లో మౌలిక వసతులకై ఎన్ని ప్రదక్షిణలు చేయాలి

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్

విశాలాంధ్ర -జామి: ప్రభుత్వాలు మారినా పేదల కోలనీల్లో మౌళిక వసతుల కల్పించండి అని పాలకులు, అధికారులు చుట్టూ కాళ్ళు అరిగేలా ఎన్నేళ్ళు ప్రదక్షిణలు చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ ధ్వజమెత్తారు. శనివారం ఉదయం మండలకేంద్రమైన జామి లో నెయ్యిల వీధిలో ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ దగ్గరలో ఉన్న జగనన్న కాలనీ లో పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను శనివారం విశాలాంధ్ర దినపత్రికలో ప్రచురితమైన కథనం పై స్పందించారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జామి మండల సమితి ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, ఎస్. కోట నియోజకవర్గ కార్యదర్శి ఖండేపల్లి భీముడు, సహాయ కార్యదర్శి ఖండేపల్లి భీముడు లతో కలిసి పర్యటించారు. అందులో భాగంగా స్థానిక పేదలు వీరిని కలిసి ఎన్నో ఏళ్ళుగా 24 కుటుంబాలం పూరి గుడెసల్లో ఇక్కడే నివాసం ఉంటున్నామని తెలిపారు. వైసిపి ప్రభుత్వ హయంలో మేము నివాసం ఉన్న చోటే పట్టాలు ఇచ్చి ఇళ్ళు నిర్మించుకునేందుకు ప్రభుత్వ ఋణ సదుపాయం కల్పించారు కానీ ఆ డబ్బులు ఏమేరకు సరిపోకపోవడం వలన మేము కొంత అప్పులు చేసుకుని ఇళ్ళు నిర్మాణం చేసుకున్నామని తెలిపారు. కానీ ఇంతవరకు మా ఇళ్ళకి విద్యుత్తు సరఫరా చేయకుండా, కాలనిలో ఎలక్ట్రికల్ స్థంబాలు వేయలేదు, వీధి లైట్లు ఏర్పాటు చేయలేదన్నారు. మంచి నీటి సదుపాయం లేదు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం మొదలైన కనీస మౌళిక వసతులకు మేము నేటికీ నోచుకోలేదని, పక్కనే నది, చుట్టూ డొంకలు ఎక్కువ ఉండటం వలన రాత్రి అవ్వగానే చిమ్మ చీకట్లో విషపూరితమైన పాములు, పురుగులు ఇళ్ళల్లోకి వచ్చేస్తున్నాయని, పసిపిల్లలతో ఉంటూ చాల భయాందోళనలతో జీవనం సాగిస్తున్నామని మా సమస్యలు పరిష్కారం చేయండి అని మేమంతా ఎన్నిసారు పాలకులు చుట్టూ, అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ఎవ్వరూ పట్టించుకోలేదని సిపిఐ నాయకులతో పేదల ఆవేదన చెప్పుకోవడం జరిగింది.

ఈ సందర్భంగా పేదలతో బుగత అశోక్ మాట్లాడుతూ ఎన్నేళ్ళుగా మీరు కష్టాలు అనుభవిస్తున్న స్థానిక పాలకుల కళ్ళకి కనపడలేదా, ఇళ్ళు నిర్మాణం కోసం చాలీచాలని ఋణం విధిల్చేస్తే భాధ్యత తిరిపోయినట్టేనా అని మండిపడ్డారు. పెదలంటే కేవలం మీ దృష్టిలో కేవలం ఓటు బ్యాంకు మాత్రమేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోలనీలు ఇచ్చేసి చేతులు దులిపేసుకుని ఏదో ఘనకార్యం సాధించినట్టు పాలకులు చెప్పుకుంటున్నారని విమర్శించారు. కాలనీలు ఏర్పాటు చేసిన తరువాత అందులో ప్రజలు నివాశయోగ్యంగా ఉండే విధంగా కనీస మౌళిక వసతులు కల్పించడం కోసం అవసరమైన నిధులు కేటాయించాలన్న కనీస అవగాహన పాలకులకి లేకపోవడం చాలా సిగ్గు చేటు అని ధ్వజమెత్తారు. నెయ్యిల వీధి జగనన్న కొలనిల్లో ఉన్న పేదలకి అండగా సిపిఐ నిలబడి కొలనీలో సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాడుతుందని తెలిపారు. మీ సమస్యలను జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకుని వెళ్లేందుకు కార్యాచరణ రూపొందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కళాశి జట్టు నాయకులు కె. కృష్ణ తో పాటు స్థానిక పేదలు పాల్గొన్నారు.

వైసీపీలో ఉత్తరాంధ్ర ఏ మేరకు అభివృద్ధి జరిగిందో చూపించండి

బొత్స కు కళా సవాల్

విశాలాంధ్ర-చీపురుపల్లి: బివైసిపి ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్రాలో జరిపించే ఒక్క పనైనా చూపించగలరా అని బొత్స సత్యనారాయణకు చీపురుపల్లి శాసన సభ్యులు, పొలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకట రావు సవాల్ విసిరారు. ప్రజలను నమ్మించే మాటలకు నూకలలు చెల్లాయని కళా ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఉత్తరాంధ్రాలో ఎన్ని పనులు చేపట్టామనేది మీరు వస్తే చూపించ గలమని ఆయన అన్నారు. ఏ పనీ చేయలేని మీరు తెలుగు దేశం పార్టీ పై విమర్శించే హక్కులేదని బొచ్చెను కల హెచ్చరించారు. ప్రజాధనాన్ని దోచుకోడానికే మీరు కాలం గడిపారే తప్పా ప్రజల అవసరాలు తీర్చేందుకు ఆలోచన చేయలేదని ఆయన ఎద్దేవా చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పై మాట్లాడే హక్కు మీకు లేదని ఆయన అన్నారు స్టీల్ ప్లాంట్ కోసం 13,000 కోట్లు రూపాయల పేకేజీ వచ్చిన సంగతి మీకు తెలిసి ఉంటోందన్నారు. మిటల్ స్టీల్‌ప్లాంట్ అనకాపల్లిలో 2 లక్షల కోట్ల వ్యయంతో రాబోతుందని ఆయన చెప్పారు. దీనివల్ల ప్రభుత్వానికి 20 వేల కోట్ల రూపాయిలు ఏటా పన్నుల రూపంలో రానుందని అన్నారు ఈ కర్మాగారం వల్ల 15 వేల మందికి ఉపాధి కలుగుతుందని కిమిడి తెలిపారు. గ్రీన్ ఎనర్జి ని ఎన్టిపిసి సమీపంలో 85 వేల కోట్ల వ్యయంతో నిర్మించేందుకు ప్రధాన మంత్రి శంఖస్థాపన చేశారని కిమిడి తెలిపారు. బిభోగాపురం విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర ఘననీయంగా అభివృద్ధి జరగనుందన్నారు. చతీష్ ఘడ్ నుంచి 6 లైన్ల రోడ్డు రానుందని చెప్పారు. అదేవిధంగా పరదీప్ నుంచి కూడా 6 లైన్ రోడ్డు రానుందన్నారు. దీంతో విశాఖపట్నం రద్దీ మరింత పెరుగుతుందని పేర్కొన్నారు., ఫలితంగా పోర్టులకు బాగా రద్దీ పెరుగుతుందని పేర్కొన్నారు. విశాఖ రైల్వే జోన్ కూడా మంజూరు అయ్యిందని చెప్పారు. ముఖ్య మంత్రి విజన్ తో ఇవన్నీ సమకూరుతున్నాయని అన్నారు. అదేవిధంగా విశాఖలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లక్ష కోట్ల వ్యయంతో నిర్మాణాలు జరగనుందన్నారు. వైసిపీ హయాంలో ఋషికొండ నిర్మానాలకు 450 కోట్లు ఖర్చు చేశారని లెక్కలు చూపించి ఏడాది కాక ముందే నిర్మాణాలు పాడవుతున్నాయని, ఈ విషయాన్ని ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ బండారం బయట పెట్టారని కిమిడి గుర్తుచేశారు. స్కామ్ ల ప్రభుత్వానికి పని చేసే ప్రభుత్వానికి తేడా

బీసీ హాస్టల్లో ఖాళీలపై ఎమ్మెల్యే అసంతృప్తి

-ముందస్తు సమాచారం లేకనే ఈ దుస్థితి

బీసీ వెల్ఫేర్ అధికారి వైఖరిపై ఎమ్మెల్యే మండిపాటు

విశాలాంధ్ర-లక్కవరపుకోట: ఎస్.కోట నియోజకవర్గంలోని ఐదు బీసీ వెల్ఫేర్ హాస్టల్లో విద్యార్థుల సంఖ్య లేక వందల కొలది సీట్లు ఖాళీలు ఏర్పడ్డాయి అని అధికారులు ముందు చూపు లేక ఐదు హాస్టల్లో సుమారు 20018 సీట్లు మిగిలిపోయాయి అని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి బీసీ వెల్ఫేర్ అధికారులపై మండిపడ్డారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ హాస్టల్ అడ్వైజరీ కమిటీ సమావేశం ఎమ్మెల్యే సమక్షంలో జరిగింది చెట్ల ఖాళీల పై ముందుగా సరైన సమాచారం ఇస్తే చాలామంది విద్యార్థులకు అవకాశాలు కల్పించే వారమని ఎమ్మెల్యే లలిత కుమారి బీసీ వెల్ఫేర్ అధికారి ఎస్ కృష్ణ పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్ కోటలో రెండు పోస్ట్ మెట్రిక్ ఒక ప్రీ మెట్రిక్ హాస్టల్ ఉన్నాయని, ధర్మవరంలో ధర్మవరంలో ఒక హాస్టల్ ఉందని వెల్ఫేర్ అధికారి తెలిపారు. ఒక్కో హాస్టల్లో 100 సీట్లకు గాను మొత్తం 400 సీట్లలో 182 ఖాళీలు ఉన్నాయన్నారు. అలాగే కొత్తవలస బాలికల హాస్టల్లో 36 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా విద్యార్థుల కాస్మటిక్ చార్జీలు 75 శాతం ఆదరణ విద్యార్థులకు మూడు నెలల సొమ్ములను విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాలో ప్రభుత్వం జనం చేసిందని తెలిపారు. ఉన్న ఖాళీలను పాఠశాల ఇంటర్ ఐటిఐ, డిప్లమో, ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థుల చే బతి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. హాస్టల్లో మైనర్ మరమ్మతులకు ఆయా శాఖలనుండి బ్రాండ్ ఇప్పించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మీడియాకు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం ప ఎమ్మెల్యే అధికారులపై మండిపడ్డారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి హాస్టల్లో చదువుతున్న విద్యార్థిని , విద్యార్థులను సొంత పిల్లల లాగా చూసుకోవాలని మెనూ సక్రమంగా అమలు చేసి మంచి ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని సంక్షేమ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ అప్పారావు, కొత్తవలస ఇన్చార్జి ఎంపీడీవో శ్రీదేవి, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు సంగీత, సురేష్, కృష్ణవేణి పాల్గొన్నారు.

జిల్లాలో జేజేఎం అమలు భేష్

అభినందించిన కేంద్ర బృందం

విశాలాంధ్ర-విజయనగరం: ఇంటింటికి త్రాగు నీటిని అందించేందుకు ఉద్దేశించిన జలజీవన్ మిషన్ అమలు తీరు జిల్లాలో ప్రశంస నీయంగా ఉందని కేంద్ర బృందం అభినందించింది. బృందం జిల్లా కలెక్టర్ ఛాంబర్లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ను, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ను శనివారం కలిసి, పథకం అమలుపై చర్చించారు. కేంద్ర జల్ జీవన్ మిషన్ బృందంలో వాష్ నిపుణులు ప్రకాష్ చంద్ర నాయక్, గోకుల్ సేతురాజ్, కె. టి. నాగరాజ్ లు ఈ నెల 26 నుండి 5 రోజుల పాటు ఎస్. కోట, దొర్లపాలెం, చీపురుపల్లి మండలం రామలింగాపురం, పూరేయవలస, గరివిడి మండలం అప్పన్నవలస తదితర గ్రామాల్లో పర్యటించి, కేంద్ర ప్రభుత్వ పథకాలైన జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ అమలు తీరును పరిశీలించారు. వాటి గురించి లబ్ధిదారులు తో మాట్లాడి వారి స్పందన తెలుసుకున్నారు. ఈ పథకాలు జిల్లాలో చక్కగా అమలవుతున్నాయని అభినందిస్తూ, మరింత పటిష్టంగా అమలు చేయటం కోసం తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతీ ఇంటికి సురక్షిత త్రాగు నీరు అందించడమే ముఖ్యమంత్రి లక్ష్యమని, పథకాన్ని సంపూర్ణంగా, మరింత పటిష్ఠంగా అమలు చెయ్యాలని కోరారు. బృందంతో బాటు జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, అర్.డబ్ల్యూ.ఎస్. సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్. కవిత పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా అధ్యక్ష పదవిపై ఆసక్తికర పోటీ

బరిలో కర్రోతు సత్యనారాయణ

విశాలాంధ్ర-భోగాపురం: తెలుగుదేశం పార్టీకి కొత్త ఊపు తీసుకురావాలనే లక్ష్యంతో పార్టీ హైకమాండ్ జిల్లా అధ్యక్షుడి నియామకంపై వేగంగా కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే ఎనిమిదికి పైగా సీనియర్ నాయకులు పోటీకి రంగంలోకి దిగారు. తమ కృషి, అనుభవం, ప్రజానుభూతిని ఆధారంగా చేసుకుని పార్టీ అధినేతల దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ రేసులో భోగాపురం మండలానికి చెందిన కర్రోతు సత్యనారాయణ కూడా ఉన్నారు. గత మూడున్నర దశాబ్దాలుగా పార్టీకి అంకితభావంతో పనిచేస్తూ వరుసగా 16 సార్లు మండల అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనకు రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకుల వరకు పరిచయం ఉంది. ఆయన నాయకత్వంలో భోగాపురం మండలంలో టీడీపీ బలపడిందని, ప్రతి ఎన్నికల్లోనూ గణనీయమైన ఓట్ల వృద్ధి తన కృషివల్లే సాధ్యమైందని కార్యకర్తలు భావిస్తున్నారు. జిల్లా అధ్యక్ష పదవిపై ఆశలు పెట్టుకున్న సత్యనారాయణ, శుక్రవారం రాత్రి విశాఖపట్నం విమానాశ్రయంలో మంత్రి నారా లోకేష్‌ను కలిసి తన బయోడేటాను అందజేశారు. పార్టీ కష్టకాలంలో తాను అండగా నిలిచానని, జిల్లా అధ్యక్ష బాధ్యతలు ఇస్తే మరింతగా కార్యకర్తలను సంఘటితం చేసి పార్టీ బలోపేతం చేస్తానని హామీ ఇచ్చారు. ఇదిలా ఉంటే, ఈ పదవికి దరఖాస్తు చేసిన నాయకుల మధ్య ఆసక్తికరమైన పోటీ నెలకొంది. వర్గ సమీకరణలు, సీనియారిటీ, ప్రజలతో అనుసంధానం, ఎన్నికల చురుకుదనం వంటి అంశాలను పరిశీలించి పార్టీ హైకమాండ్ తుది నిర్ణయం తీసుకోనుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం రాబోయే రోజుల్లో లోకేష్ మరికొందరు ఆశావహులను కూడా కలిసే అవకాశం ఉంది. అనంతరం టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆమోదం తీసుకుని కొత్త జిల్లా అధ్యక్షుడి పేరును ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. జిల్లా అధ్యక్ష పదవిలో మార్పు జరుగుతున్న నేపథ్యంలో టీడీపీ కార్యకర్తల్లో ఉత్కంఠ నెలకొంది. "ఎవరు కొత్త జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపడతారు?" అన్న అంశంపై టీడీపీ శ్రేణుల్లో చర్చలు చురుగ్గా సాగుతున్నాయి.

కథల పోటీలో కెజిబివి గంట్యాడ పాఠశాల విద్యార్థినికి బహుమతి

విశాలాంధ్ర-గంట్యాడ : మాచిరాజు బాల సాహిత్య కళాపీఠం, తెలంగాణ రాష్ట్రం రాష్ట్ర స్థాయి లో నిర్వహించిన కథల పోటీల్లో 480 మంది విద్యార్థులు పాల్గొన గా కె. జి. బి.వి గంట్యాడ పాఠశాల విద్యార్థిని బి.హారిక తృతీయ బహుమతి ని సాధించింది300 రూపాయలు నగదు బహుమతి,400 రూపాయలు విలువగల చందమామ కథల పుస్తకం, సర్టిఫి ఒట్ ఇచ్చారు. కేజీబీవీపాఠశాల నుంచి పాల్గొన్న 40 మంది విద్యార్థులకు ప్రమాణ పత్రాలు అందించారాని ప్రిన్సిపాల్ అల్లు జ్యోతి తెలియజాశారు.

రంగు మారిన నీటి పంపిణీ పై సత్వరమే స్పందించిన అధికారులు

- తాగునీరు కలుషితం కాలేదని స్పష్టం
- ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదు

విశాలాంధ్ర-విజయనగరం : నగరంలో కొన్ని ప్రాంతాలలో రంగు మారిన నీరు పంపిణీ జరుగుతున్నట్లు వస్తున్న ఉదంతాల నేపథ్యంలో విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో సిబ్బంది సత్వరమే స్పందించారు. రంగు మారిన నీరు రావడానికి గల కారణాలను అన్వేషించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎగువ నుండి కొత్తనీరు వచ్చి చేరడం ఒక కారణంగాను, మరోవైపు నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో కొద్దిగా రంగు మారిన నీరు వచ్చి చేరుతున్నట్లు గుర్తించారు. దీంతో ప్రాథమికంగా నగర వ్యాప్తంగా నీటి పంపిణీని కొంత సమయం పాటు నిలుపుదల చేశారు. అనంతరం నిలకడగా ఉన్న నీరు ప్రవహించే అవకాశం ఉన్నందువల్ల మంచినీరు పంపిణీ జరిగే ఏర్పాట్లను చేస్తున్నారు. అలాగే అన్ని వాటర్ ట్యాంకులను పరిశుభ్రపరుస్తున్నారు. శుద్ధ జలానికి అవసరమైన ఆలమ్ ను మరియు క్లోరిన్ ను మోతాదు మేర మిళితం చేసి నీటి పంపిణీకి సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొత్త నీరు వచ్చి చేరడంతో అక్కడక్కడ రంగు మారిన నీరు వస్తున్నట్లు గుర్తించామన్నారు. అయితే ఎక్కడ తాగునీరు కలుషితం కాలేదని స్పష్టం చేశారు. ఇందుకోసం అన్ని సచివాలయాల పరిధిలో అనుక్షణం క్లోరిన్ పరీక్షలను నిర్వహించాలని, వచ్చిన నివేదికను వెనువెంటనే సమర్పించాలని సంబంధిత కార్యదర్శులకు ఆదేశించామన్నారు. కావున ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని త్వరలోనే మంచినీరు పంపిణీ జరుగుతుందని స్పష్టం చేశారు.

సోంపురం పాఠశాల సందర్శనలో ఎంఈఓ

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని సోంపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి పి.బాల భాస్కరరావు శనివారం సందర్శించారు.ఈ సందర్భంగా పాటశాల పరిసరాలు తరగతి గదులు,కిచెన్ గార్డెన్, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్ మొదలగునవి పరిశీలించారు. అంతరం 1-5 తరగతుల విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీషు, చదివించడం ,రాయించడం, చతుర్విద ప్రక్రియలు,శ్రీమతి డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీలు కె.రామ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీతం కళాశాలలో ఇన్నోవేషన్ ప్రోటోటైప్- స్టార్ట్ అప్ సెషన్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: స్థానిక సీతం కళాశాలలో కృత్రిమ మేధస్సు మరియు డేటా సైన్స్ (కంప్యూటర్ సైన్స్) ఆధ్వర్యంలో"ఇన్నోవేషన్ ప్రోటోటైప్ ధ్రువీకరణపై సెషన్‌ను " ప్రొఫెసర్,రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ డీన్ డాక్టర్ వి.జి ప్రసునా ప్రారంభించారు. ఈ సెషన్ లో అనేక విషయాల గూర్చి ప్రబోధించారు,ఒక ఆలోచనను స్టార్ట్-అప్‌గా ఎలా మార్చాలి "విలువ ప్రతిపాదన ఫిట్ , వ్యాపార ఫిట్ సాధించడం. ఈ సెషన్‌లో, విద్యార్థులు వారి ఆవిష్కరణలను వాస్తవ ఉత్పత్తులుగా మార్చడానికి అవసరమైన ప్రక్రియల గురించి, ప్రధాన అంశాలు వినూత్న ఆలోచనలను వాణిజ్యపరంగా లాభదాయకమైన స్టార్టప్ ఎంటర్‌ప్రైజెస్‌గా మార్చే విధానాలను యొక్క ప్రయోజనాలు,ఉత్పత్తి మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా, లాభదాప్రస్తుత వ్యాపార ప్రపంచంలో వినూత్న ఆలోచనల ఆలోచనలకు గురించి వివరించారు.ఒక అద్భుతమైన ఆలోచనను స్పష్టమైన, మార్కెట్-సిద్ధంగా ఉన్న ఉత్పత్తిగా మార్చడంలో ప్రోటోటైప్ ధ్రువీకరణ యొక్క క్లిష్టమైన ప్రక్రియను వివరించారు. విద్యార్థులను చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించారు. వారి ఆలోచనలు, ప్రశ్నలను పంచుకోవడానికి వారిని ప్రోత్సహించారు,స్టార్టప్ ఇండియా వంటి సంస్థలు అందించే అవకాశాలను గూర్చి ప్రస్తావించారు.ఈ కార్యక్రమంలో కృత్రిమ మేధస్సు మరియు డేటా సైన్స్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా. రాధ ,రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ డీన్ డాక్టర్ ప్రసున్నా, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే శంబంగి వి మతిస్థిమితం లేని ఆరోపణలు

ఎమ్మెల్యే బేబీనాయన

విశాలాంధ్ర-బొబ్బిలి : పారాది వంతెన నిర్మాణం జాప్యం కారణంగా రోడ్ల అభివృద్ధి ఆలస్యం జరిగింది, ప్రజలు అర్థంచేసుకుని సహకరిస్తున్నారని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి పథకాల అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కూటమి ప్రభుత్వం పై తన పైన ప్రతిపక్ష పార్టీ మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆరోపణలను ఎమ్మెల్యే బేబీనాయన ఖండించారు. శనివారం బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గం చరిత్రలో మాజీ ఎమ్మెల్యే శంబంగి కి కలిగిన ఓటమి కారణంగా మానసిక ఒత్తిడికి గురై, మతిస్థిమితం లేని విధంగా వారు గత 5 ఏళ్లు ఎమ్మెల్యే గా ఉన్నారని, పారాది బ్రిడ్జి సమస్యని పక్కన పెట్టి వారి స్వార్థంతో తాత్కాలిక వంతెనలు వేసి సొమ్ముచేసుకున్న సంగతి మర్చిపోయారని గుర్తుచేశారు.కేవలం పారాది బ్రిడ్జి కారణంగా ట్రాఫిక్ ను బొబ్బిలి పట్టణం, తెర్లాం మరియు బాడంగి రోడ్ల ద్వారా మళ్లించడం వలన మాత్రమే రోడ్లు పాడయ్యాయని తెలిపారు.. ఇంత ఆర్థిక సంక్షోభంలో కూడా మన నియోజకవర్గ రోడ్ల పరిస్థితి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, కావలసిన నిధులు మంజూరు చేయించానన గుర్తు చేశారు. సుమారు 9కోట్లు రూపాయల నిధులు మంజూరు చేయించినట్లు మీడి యా సమక్షంలో ఎన్నో సార్లు చెప్పానని, ఒక ప్రణాళిక ద్వా రా నియోజ కవర్గ అభివృద్ధి చేస్తామని, ప్రతిపక్షాల మాటలకు కుంగిపోమని అన్నారు.. మీరు పదే పదే చెప్పిన ఆ రాజా కాలేజ్ రోడ్ లోనే సూమారు 10 విద్యాసంస్థలు ఉన్నాయని పెద్ద డిగ్రీ కాలేజ్ వద్ద పెద్ద గుంత ఏర్పడి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, తన సొంత నిధులతో శాశ్వత మరమ్మత్తులు చేస్తున్నానని(ప్రతి బిల్లు తనవద్ద ఉందని), మున్సిపల్ నిధులు విడుదల అవ్వగానే వాటిపై కాంక్రీట్ తో రోడ్లను నిర్మిస్తామని తెలిపారు. మీ హయాములో పండగల పేరుతో, మీరు చేసినట్లుగా ఉత్తి మట్టి వేసి లక్షల నిధులు వృధాచెయ్యలేదని ఎద్దేవా చేశారు.. మాజీ ఎమ్మెల్యే చెప్పినట్లు 12 మంది యువకులు మరణించడానికి పలు కారణాలు ఉన్నాయి తప్ప, కేవలం రోడ్లు బాగోలేక కాదు అని చెప్తూ, కావాలంటే ఆ కుటుంబాలను పరామర్శించి వివరాలు తెలుసుకోమని అన్నారు..దయచేసి యువకుల మరణాలపై మీ అధినాయకుడులా శవరాజకీయాలు చేయొద్దని హితవు పలికారు.గ్రోత్ సెంటర్ లో ఏమైనా అభివృద్ధి జరిగింది అంటే, అది కేవలం టీడీపీ హయాములోనే జరిగిందని.. పారిశ్రామికవేత్తలతో కుమ్మక్కయ్యి, కార్మికులను పోలీసులతో కొట్టించి జైలు కు పంపించిన ఘనత మీకే దక్కుతుందని ఆరోపించారు. నియోజకవర్గంలో ఉన్న కొన్ని గ్రామాలు మరియు పట్టణానికి గల త్రాగునీటి సదుపాయాలను దారి మళ్లించిన సంగతి మరిచారా అంటూ ప్రశ్నించారు.? . నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ ను తప్పుదారి పట్టించినట్లు ఇంకెక్కడా లేదని బోరులు లేకుండా, ట్యాంకులు లేకుండా ఇంటింటికీ కొళాయులు వేసేసి మమ అనిపించిన ఘనత మీకే దక్కుతుంది అని, ఆ నిధులను ఎలా పక్కత్రోవ పట్టించారో తమకి తెలుసని అన్నారు. పవన్ కళ్యాణ్ సహకారం, సంకల్పంతో ప్రతి గ్రామానికి త్రాగు నీరు, రోడ్లను నిర్మిస్తామని తెలిపారు... ప్రస్తుతం రాష్ట్రం ఉన్న ఆర్థిక పరిస్థితులలో కూడా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని, మీరు ఏదో కార్యక్రమం పేరుతో ప్రతి రోజు ప్రజల వద్దకు వెళ్లి రాష్ట్రంలో ఏదో జరిగిపోతుంది అని తెలిపే ప్రయత్నం చేస్తున్నా, మిమ్మల్ని ప్రజలు ఛీ కొడుతున్నారని మాకు తెలుసని అన్నారు. అలాగే, నిన్న బొబ్బిలి మీదుగా వెళ్లిన బస్సులో జరిగిన సంఘటన తమకు అనుమానం కలిగిస్తుందని, అది కొంతమంది కేవలం ప్రభుత్వ పథకానికి మచ్చ తెచ్చే ప్రయత్నంగా ఉన్నట్లు కొందరు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపి, తక్షణమే ఆ సంఘటనపై విచారణ జరపాలని పోలీసు వారికి సూచించారు .

అభివృద్ధి సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్ళు : మంత్రి కొండపల్లి

విశాలాంధ్ర-బొండపల్లి (విజయనగరం): మండలంలోని బొండపల్లి, అంబటివలస గ్రామంలలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలను రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ 68.60 లక్షలతో గ్రామసచివాలయ భవనాలను నిర్మించారు. బొండపల్లి మండల కేంద్రంలో గ్రామ సచివాలయ భవనంలో రూ.౹౹ 25 లక్షలు యం జి యన్ ఆర్ ఈ జి ఎస్ నిధులతో నిర్మించిన అదనపు అంతస్తును, మండలంలోని అంబటివలస గ్రామంలో రూ.౹౹ 43.6 లక్షలతో నిర్మించిన నూతన సచివాయాన్ని మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రికి ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం రాష్ట్రంలో ఒకవైపు పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూనే, సంక్షేమానికి కూడా అత్యధిక ప్రాధాన్యత నిస్తోందని అన్నారు. సుమారు 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవంతో, నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన గొప్ప దార్శనికత కలిగిన నేత నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రం అన్ని విధాలా ముందుకు వెళ్తోందని చెప్పారు. ముఖ్యంగా గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు ఎనలేని ప్రాధాన్యత నిస్తున్నామని అన్నారు. గ్రామ సచివాలయాల్లో ఉన్న వసతులను వినియోగించుకుని, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు అవసరమైన సర్వీసును అందజేయాలని సూచించారు. రాష్ట్రం అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ కష్టకాలంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాధ్యతాయుతంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం, ప్రజలకు మెరుగైన అవకాశాలు కల్పించడం కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తున్నారని అన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ 20 ఏళ్ల పాటు కూటమి పాలన సాగాల్సిన అవసరం ఉందని అన్నారు. అర్హులైన పెన్షన్ దారులు అందరికీ పెన్షన్ ఇస్తున్నామని, పెన్షన్ దారులు అధైర్య పడాల్సిన అవసరం లేదని చెప్పారు. రాష్ట్రంలో ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి, సంక్షేమం విషయంలో రాజీ లేకుండా కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందని మంత్రి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్త దాన శిబిరం

విశాలాంధ్ర-దత్తిరాజేరు: జనసేన పార్టీ అధ్యక్షులు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా సరయ్యవలస గ్రామంలో శనివారం ఎన్‌విఎస్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యురాలు అయినటువంటి పడాల అరుణమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాయకులు డిప్యూటీ సి ఎం పవన్ కళ్యాణ్ సెప్టెంబర్ 2న పుట్టినరోజు సందర్భంగా యువకులు అత్యంత ఉత్సాహంతో రక్తదానం చేసారని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షులు అప్పారావు, జిల్లా కార్యనిర్వాహక కమిటీ సభ్యులు మామిడి దుర్గాప్రసాద్, చంద్ర శేఖర్, లక్ష్మునాయుడు కూటమినాయకులు పాల్గొన్నారు.

బెల్టు షాపులే.. సిండికేట్ వ్యాపారానికి వెన్నెముక..

గ్రామాల వారీగా విచ్చలవిడిగా మద్యం పంపిణీ చోద్యం చూస్తున్న అధికారులు

విశాలాంధ్ర-చీపురుపల్లి: రైతే దేశానికి వెన్నెముక అనే నినాదం ప్రతి రాజకీయ నాయకుని నోటి వెంట విన్నదే.. అయితే దీనికి భిన్నంగా చీపురుపల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో బెల్ట్ షాపులే గ్రామాలకు సిండికేట్ వ్యాపారులకు వెన్నెముకగా మారిందంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు బెల్ట్ షాపులపై ఉక్కు పాదం మోపుతాం అంటూ చేసిన ఊకదంపుడు ఉపన్యాసాలు ప్రస్తుతం చీపురుపల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మచ్చుకైనా కానరాకపోవడంతో పలువురు అధికారుల పనితీరును బహిరంగంగా దుయ్యబడుతున్నారు. చీపురుపల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ప్రభుత్వ నిబంధనలతో ఏర్పాటు చేసిన వైన్ షాపుల కంటే గ్రామాల వారీగా విచ్చలవిడిగా పాటలు నిర్వహిస్తూ బెల్ట్ షాపులను ఏర్పాటు చేయడం పట్ల పలువురు పాలకుల పనితీరును కూడా దూయపడుతున్నారు. గ్రామంలో బెల్ట్ షాపు ఏర్పాటు చేయడానికి వేలంపాట నిర్వహించి వేలంపాటలో ఎవరు విజేతగా నిలిస్తే వారు మాత్రమే గ్రామంలో బెల్ట్ షాపును ఏర్పాటు చేసుకోవాలంటూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేస్తున్న పట్ల పలు గ్రామాల ప్రజలు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. బెల్ట్ షాపులు నిర్వహణ కొరకు గ్రామంలో నిర్వహించే వేలం పాటకు వచ్చిన మొత్తాన్ని గ్రామ అభివృద్ధి కొరకు ఖర్చు చేయాలంటూ గ్రామాల వారీగా జరుగుతున్న జెంటిల్మెన్ ఒప్పందాలు కారణంగా పుట్టగొడుగుల బెల్ట్ షాపులు వ్యాపారం కొనసాగుతుందంటూ పలువురు ఆరోపిస్తున్నారు. దీని కారణంగానే ప్రభుత్వ అనుమతులు పొందిన వైన్ షాపులకు చేరుతున్న మద్యం సీసాలను షాపుల దగ్గర అన్లోడింగ్ చేసే ముందే బెల్ట్ షాపులకు అవసరమైన మద్యం సీసాలను ప్రత్యేకంగా వేరుచేసి సిండికేట్ వ్యాపారులు రహస్యంగా వాటిని గ్రామాల వారీగా బెల్టు షాపులకు సరఫరా చేస్తున్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. చీపురుపల్లి లో సిండికేట్ వ్యాపారులు తమనైన శైలిలో ప్రత్యేక ముద్రను తయారుచేసి మద్యం బాటిల్ పైన వాటిని ముద్రిస్తూ సరఫరా చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారులకు సిండికేట్ వ్యాపారులకు మధ్య కుదిరిన కొన్ని ఒప్పందాల కారణంగా సిండికేట్ ముద్ర తో కూడిన మద్యం సీసాలు పట్టుబడిన సంబంధిత అధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు సైతం జిల్లా అధికారులకు ఇప్పటికే ఫిర్యాదు చేసి ఉన్నారు. ప్రజా ప్రతినిధుల ఆరోపణలు గ్రామస్తుల ఫిర్యాదులు మేరకు ఎక్సైజ్ శాఖకు సంబంధించిన విజిలెన్స్ అధికారులు కూడా కంటి తుడుపుగా దాడులు జరిపి తమదైన శైలిలో కేసులు నమోదు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారని పలు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం మిలాకత్ వ్యవహార శైలి కారణంగా గ్రామాల వారీగా గుడి బడి తేడా లేకుండా విచ్చలవిడిగా మద్యం షాపులు ఏర్పాటు చేస్తున్నారంటూ ఆరోపణలు చేస్తున్నారు. మద్యం సిండికేట్ ముద్రతో అధికార మద్యం షాపుల నుండి కొనుగోలు చేస్తున్న ప్రతి ఒక్క మద్యం సీసా పైన షాపు వద్ద పది రూపాయలు అధిక ధరకు కొనుగోలు చేస్తూ.. వాటిని గ్రామాల వారీగా 20 నుండి 50 రూపాయల వరకు అధిక ధరలను పెంచుతూ అమ్మకాలు జరుగుతున్నట్లు మందుబాబులు సైతం గగ్గోలు పెడుతున్నారు. గ్రామాల నుండి పట్టణాలకు చేరుకోలేక బెల్ట్ షాపు నిర్వాహకులు పెంచిన ధరలకే మద్యం సీసాలను కొనుగోలు చేస్తున్న మందుబాబుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. కూటమి నాయకులు ఎన్నికలకు ముందు గ్రామాలలో మద్యం షాపులను పూర్తిగా రద్దు చేస్తామంటూ ఇచ్చిన హామీలు ఏమయ్యాయి అంటూ పలువురు పాలకుల పనితీరును కూడా దుయ్యబడుతున్నారు. స్థానిక ఎక్సైజ్ శాఖ అధికారులతో పాటు, ప్రత్యేక బృందాలు చేస్తున్న దాడులు కూడా నామమాత్రంగానే చేస్తున్న పట్ల పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధన మేరకు ఏ మద్యం షాపు ద్వారా అయినా బెల్ట్ షాపులకు మద్యం సరఫరా జరిగితే వాటిని గుర్తించి సంబంధిత షాపుల పైన కేసులు నమోదు చేసి లైసెన్సులో రద్దు చేయాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వంలో భాగమైన జనసేన నాయకులు చీపురుపల్లిలోని సిండికేట్ అక్రమ దందా వ్యాపారం పైన జిల్లా అధికారులు కూడా ఫిర్యాదు చేసి ఉన్నారు. పాలకులు కూడా చీపురుపల్లి ప్రధాన కేంద్రంగా జరుగుతున్న అక్రమ సిండికేట్ దందా పైన దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఆకట్టుకున్న వినాయకుడు

విశాలాంధ్ర-గుర్ల: మండలంలో ఆనందపురం గ్రామంలో గత ఐదు సంవత్సరాలుగా మట్టి వినాయకులతో భక్తులను ఆకట్టుకుంటున్నారు. ఈ సంవత్సరం నవభారత యువజన సంఘం ఆధ్వర్యంలో విభిన్న ఏర్పాటుతో సినీ సెట్టింగ్ తలపించేలా ఏర్పాటు చేసిన పందిరి - మట్టి వినాయకులతో భక్తులను ఆకట్టుకుంటుంది. ప్రతిరోజు వందలాదిమంది భక్తులు పూజలు జరుపుకుంటున్నారు. ఈ ఐదు రోజులు కూడా సాయంత్రం స్వామివారి సంకీర్తనలు, భజనలు, కోలాటాలతో ఆకట్టుకుంటున్నారు. నవ భారత యువజన సంఘం ఆధ్వర్యంలో 5వ రోజు ఆదివారం మహా అన్నదానం కార్యక్రమం జరుగునుంది.

బల్లంకిలో చురుగ్గా సమీత్వ సర్వే

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమీత్వ సర్వే చురుగ్గా సాగుతుంది. పంచాయతీ కార్యదర్శి రెడ్డి వెంకట కృష్ణవేణి మాట్లాడుతూ ఈ సమిత్వ సర్వేలో గ్రామానికి సంబంధించి 800లకు పైగా ఇల్లులు ఇళ్ల స్థలాలకు సంబంధించి ఈ సర్వే నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. ఇప్పటివరకు 400లకు పైగా ఇల్లులు ఇళ్ల స్థలాలకు సమిత్వ సర్వే చేయడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సర్వేయర్ బొబ్బిలి ఆకు నాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పెందుర్తి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

డిఎల్‌డిఓ కార్యాలయాన్ని సందర్శించిన కృష్ణ తేజ

విశాలాంధ్ర-చీపురుపల్లి: ఉప ముఖ్యమంత్రి ఓఎస్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఎం.కృష్ణ తేజ శనివారం మధ్యాహ్నం చీపురుపల్లిలోని డిఎల్‌డిఓ కార్యాలయాన్ని సందర్శించారు. చీపురుపల్లి మార్కెట్ యార్డ్ లోని సచివాలయం మూడులో నిర్వహిస్తున్న డి.ఎల్.డి.ఓ కార్యాలయాన్ని మొదటగా ఆయన పరిశీలించారు. అనంతరం చీపురుపల్లి మండల పరిషత్ కార్యాలయమునకు సందర్శించి అధికారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ పాలకులు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఇప్పిలి అనంతం సారథ్యంలో డి ఎల్ డి ఓ హేమ సుందర్ రావ్ ఎంపీడీవో సురేష్ మండల పరిషత్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లెండిలో కృత్రిమ మేధ వాడకంపై కార్యశాల

విశాలాంధ్ర-డెంకాడ: లెండి ఇన్స్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ & సిస్టమ్స్ ఇంజనీరింగ్ (సి ఎస్ ఎస్ ఈ) విభాగం ఆధ్వర్యంలో హాండ్స్-ఆన్ వర్క్‌షాప్ నిర్వహించబడింది. విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని, కృత్రిమ మేధతో కూడిన వినూత్న అవకాశాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఈ వర్క్‌షాప్‌లో పలు సంస్థలు పాల్గొని ప్రముఖ ఏఐ టూల్స్ ప్రాముఖ్యత వాటి సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యం, సాంకేతిక సామర్థ్యాలను వివరించారు. మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కె సువర్ణ శ్రీ, కే.స్. మృదుల, వి మౌనిక, బి. ప్రణతి ఇంటరాక్టివ్ సెషన్స్ నిర్వహించారు. కృత్రిమ మేధ రూపంలో ఎలా పరిశ్రమలు మారుతున్నాయో, యువతకు ఎలా కొత్త అవకాశాలు సిద్ధిస్తున్నాయో స్పష్టంగా వివరించారు. సంస్థ ప్రిన్సిపాల్ డా వి. వి. రామారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఏఐ టూల్స్‌ను ప్రత్యక్షంగా తెలుసుకునే వేదిక నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓడి డాక్టర్ ఆర్.రాజేందర్, వైస్ ప్రిన్సిపల్స్ డా హరిబాబు తమ్మినేని, డా వాకా అంజిరెడ్డి, అధ్యాపకులు స్వరూప్, రెహ్మాన్, నీరజ, రమాదేవి, సౌజన్య, వైజాగ్ ఇన్ఫోసిస్ హెడ్ నర్రా సురేష్, సంస్థ సెక్రటరీ కరెస్పాండంట్ కె శివరామ కృష్ణ, ప్రిన్సిపాల్ డా వి.వి.రామారెడ్డి, ట్రైనింగ్ అండ్ ప్లేసెమెంట్ డీన్ ప్రకాష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతో భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఇటీవల 10వ తరగతి, ఇంటర్మీడియట్, బి.టెక్ 2023-24 విద్యా సంవత్సరంలో నిర్వహించిన పరీక్షల్లోఉత్తమ ప్రతిభ కనబర్చి, మంచి మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించిన పోలీసు ఉద్యోగుల పిల్లలను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పోలీసు కార్యాలయంలో అభినందించి, ప్రశంసా పత్రాలను, మెరిట్ స్కాలర్ షిప్ లను అందజేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ ఉన్నత విద్యతో మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని, అందుకు తగిన విధంగా విద్యార్థులు శ్రద్ధ, క్రమశిక్షణతో తమ చదువులను కొనసాగించి, మంచి ఫలితాలను సాధించాలన్నారు. స్కాలర్షిప్స్ పొందిన విద్యార్థులు ప్రస్తుతం ఏమి చదువుతున్నది, ఎక్కడ చదువుతున్నది, ఎలా చదువుతున్నది వంటి విషయాలను జిల్లాఎస్పీ విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం చదువులో ఉన్నతంగా రాణించేందుకు విద్యార్థులకు జిల్లా ఎస్పీ కొన్ని సూచనలు చేసారు. 2023-24విద్యాసంవత్సరంకు చదువులో ప్రతిభ కనబర్చిన, ఉన్నతంగా రాణించిన పోలీసు ఉద్యోగుల పిల్లలను ప్రోత్సహించాలనేలక్ష్యంతో వారు సాధించిన మార్కులు ఆధారంగా రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం 87 మంది విద్యార్థులకు రూ.16,54,000/- లను స్కాలర్ షిప్స్ మంజూరు చేసిందన్నారు. ఒక్కొక్క విద్యార్థికి వారు సాధించిన మార్కులు ఆధారంగా రూ.10 వేలు నుండి రూ.30వేలు వరకు మంజూరు చేసిన స్కాలర్ షిప్స్‌ను ప్రధానం చేసినట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. వీటికి అదనంగా 2023-24 విద్యా సంవత్సరంలో నిర్వహించిన ఐఐటి, నీట్, జె.ఈ.ఈ. అడ్వాన్సు పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు సాధించిన ర్యాంకులు ఆధారంగా మరో 11 మంది విద్యార్థులకు మెరిటోరియస్ స్కాలర్షిప్స్ గా రూ.6,95,000/- లను చీఫ్ ఆఫీసు మంజూరు చేసిందన్నారు. ఒక్కొక్క విద్యార్థికి రూ.25వేలు నుండి రూ.1.20 లక్షలను మెరిటోరియస్ స్కాలర్షిప్స్ త్వరలో అందించనున్నట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, వెల్ఫేర్ ఆర్ఐ ఎన్.గోపాల నాయుడు, పోలీసు ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్ అగ్రహారం గ్రామ సచివాలయం సందర్శన

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో శనివారం ఎమ్మార్ అగ్రహారం గ్రామ సచివాలయాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ సందర్శించారు. సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.రాంబాబు, ఈవోపీఆర్డి నీలిమ, పంచాయతీ కార్యదర్శి ఫిరోజ్ కుమార్, పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి లొట్టి వెంకట్రావు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా సి.హెచ్.సూర్యనారాయణ

విశాలాంధ్ర-వేపాడ: వేపాడ మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్ సూర్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయనకు పదోన్నతిగా ఎంపీడీఓ రావడంతో నెల రోజులు పాటు శిక్షణ నిమిత్తం సామర్లకోటలో నెలరోజుల పాటు జరిగే తర్ఫీదునిచ్చే(ట్రైనింగ్ ప్రోగ్రాం)సమావేశానికి వెళ్లారు. శిక్షణ అనంతరం తిరిగి మండల పరిషత్తు విధుల్లో చేరారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

విశాలాంధ్ర - పూసపాటిరేగ: గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు గంజాయి కేసులు, పోక్సో చట్టం, ట్రాఫిక్ నియమాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ఎస్సై దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, త్రిబుల్ రైడింగ్, రేస్ డ్రైవింగ్ వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలు ప్రాణాంతకమని, వాటిని నివారించాల్సిన అవసరం ఉందని విద్యార్థులకు వివరించారు. చట్టవిరుద్ధమైన చర్యల పరిణామాలు, వాటికి సంబంధించిన శిక్షల గురించి స్పష్టమైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు కూటమి ప్రభుత్వ హయాంలో ఆర్థిక భరోసా

ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారు రాజు

విశాలాంధ్ర - డెంకాడ: ఆడబిడ్డలు అక్క చెల్లెలు సామాజికంగా ఆర్థికంగా ఎదగాలని కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ కరోత్తు బంగారు రాజు అన్నారు. శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమంలో భాగంగా శ్రీ శక్తి పథకం మహిళలకు ఉచిత సౌకర్యం విజయోత్సవ సభ పెదతాడివాడలోని పివిఆర్ ఫంక్షన్ హాల్ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయనగరం టిడిపి అధ్యక్షుడు కిమిడి నాగార్జున హాజరయ్యారు. ఈ సందర్భంగా వారి ఇరువురు మాట్లాడుతూ అక్కా చెల్లెమ్మలను సామాజికంగా ఆర్థికంగా పైకి తీసుకువచ్చి వారి కాళ్లపై వాళ్లు సొంతంగా వ్యాపారాలను చేసుకుని ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, మహిళా సాధికారత మహిళ స్వావలంబనను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున, నియోజకవర్గ పరిశీలకులు ఎండి నజీర్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, విశాఖ నార్త్ పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, పార్లమెంట్ మహిళా అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి, పార్లమెంట్ ఉపాధ్యక్షులు అకిరి ప్రసాదరావు, బీజేపీ ఇంచార్జ్ బుర్లె శ్రీధర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మినాయుడు, మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, మహంతి శంకర్రావు, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పార్లమెంట్ కార్యదర్శి లంక అప్పలనాయుడు, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి పతివాడ విద్యాసాగర్ నాయుడు, టిడిపి నాయకులు మైలపల్లి సింహాచలం, నీలాపు అప్పల రామిరెడ్డి, ఏఎంసి చైర్మన్ గేదెల గాయత్రి, మహిళా నాయకులు చిల్ల పద్మ బొంతు ఉమా, లంక హైమవతి పాల్గొన్నారు.

మామిడి రైతులకు అవగాహన

విశాలాంధ్ర - బొబ్బిలి : మామిడి పంటలపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని ఉద్యాన శాఖ అధికారి ఎస్.వెంకటరత్నం డొంగురువలస గ్రామంలో నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మామిడి పంట యాజమాన్యంలో భాగంగా కొమ్మల కత్తిరింపు, పునరుద్ధరణ, ఎరువులు, పచ్చి రొట్టె ఎరువులు, జీవన ఎరువులు, సస్యరక్షణ చర్యలలో రైతులు చేపట్టవలిసిన విధానాన్ని వివరించారు. ఉద్యాన అధికారి ఎస్.వెంకట రత్నం మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలు రాయితీ లు గురించి తెలియజేశారు.

బాడాంలో సీఐ పల్లె నిద్ర

విశాలాంధ్ర - మెరకముడిదాం: మండలంలో బాడాం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం రాత్రి చీపురుపల్లి సిఐ శంకర్రావు పల్లె నిద్ర చేసారు. ఈ సందర్భంగా సిఐ శంకర్రావు మాట్లాడుతూ పెద్దలతో యువతతో మమేకమై యోగక్షేమాలను అడిగి తెలుసుకొన్నారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలను యువతకు వివరించారు. ద్విచక్ర వాహనాలను డ్రైవింగ్ చేసేవారు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువత తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి కాలనీలో భారీ అన్నదానం

విశాలాంధ్ర - రాజాం: స్థానిక అమ్మవారి కాలనీలో గణేష్ నిమజ్జనం సందర్భంగా శనివారం భారీస్థాయిలో అన్నదానం జరిగింది. అమ్మవారి కాలనీ ఎఎంసి కమిటీ సభ్యులు పెంకి గౌరీశ్వరరావు, ఆరిపిల్లి వెంకటనాయుడు, మహాదాసం బాజ్జీ, పెంకి చైతన్య, ఇజ్జు శేఖర్, మహాదాసం సతీష్, సలాది అచ్యుతరావు, సలాది పార్వతి, కార్తీక్, మోహన్, శ్రీహరి, వెంకటేష్, కుమార్, శ్రీను అమ్మవారి కాలనీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి. ఈ అన్న ప్రసాదం స్వీకరించడానికి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు సుమారు 2000 మంది వరకు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

మహారాజా హాస్పిటల్‌లో సిబ్బంది ప్రవర్తన మారాలి



విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : మహారాజా ఆసుపత్రి సిబ్బంది ప్రవర్తన మారాలని జై భీమ్ రావు భారత్ పార్టీ విజయనగరం జిల్లా ఎంపీ ఇన్చార్జ్ చిన్నం అరుణ్ కుమార్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల కొంతమందికి సరైన సమయంలో వైద్యం అందటం లేదని, ముఖ్యంగా రాత్రి వేలల్లో నర్సులు అందుబాటులో ఉండటం లేదన్నారు. రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అడిగితే నర్సులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని కొంతమంది రోగులు వాపోయారన్నారు. రాత్రి వేళల్లో స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో లేక పోవడం ఒక సమస్య అయితే, అవసరం లేని కేసులు కూడా కేజీహెచ్ రిఫర్ చేయడం మరొక సమస్యగా మారిందన్నారు ,హాస్పిటల్ లో శానిటేషన్ మరి అధ్వానంగా ఉందని, శాంపిల్ కలెక్షన్స్ ఇవ్వడంలో అటాచ్డ్ బాత్రూమ్ లేక రోగులు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారన్నారు ఈ విషయమై జిల్లా మరియు రాష్ట్ర కమిటీ సూపరటెండ్ నీ కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఇన్చార్జి చిన్నం అరుణ్ కుమార్ ప్రధాని కార్యదర్శి కనిగిరి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నర్సయ్య, రాజాం ఇంచార్జ్ పొడుగు రామకృష్ణ, గరివిడి అధ్యక్షులు మామిడి కుమార్ రాజు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - వేపాడ: ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని వల్లంపూడి సచివాలయంను శనివారం ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా సచివాలయంలో గల ఆధార్ కేంద్రం పనితీరును పరిశీలించారు.అలాగే ప్రస్తుతం జరుగుతున్న రేషన్ కార్డుల పంపిణీని, సమిత్వ సర్వేలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.పద్మ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాతృ శిశు మరణాలపై సమీక్ష



విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డిఎంహెచ్వో డాక్టర్ ఎస్ జీవనరాణి అధ్యక్షతన శనివారం మాతృ శిశు మరణాలపై జిల్లా ఉప కమిటీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జూలై నెలలో సంభవించిన మాతృ శిశు మరణాల యొక్క కారణాలు అడిగి తెలుసుకున్నారు భవిష్యత్తులో మరణాలు సంభవించకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భిణీలకు రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. మరణాలు సంభవించకుండా ఉండేందుకు క్షేత్రస్థాయి నుండి ఉన్నత శ్రేణి ఆసుపత్రికి తరలించే విధంగా చూసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉప కమిటీ నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాస్, డా.కె.రాణి, డా.కె. భాగ్య లక్ష్మీ, . డా. స్వాతి బి.టి. నాయుడు, పి. రవికుమార్, డెమో వి చిన్న తల్లి తదితరులు పాల్గొన్నారు.

సీతంలో మిమ్మల్ని మీరు సమృద్ధి చేసుకోండి అంశంపై వర్క్‌షాప్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: స్థానిక గాజులరేగ పరిధిలోగల సీతం కళాశాలలో "మిమ్మల్ని మీరు సమృద్ధి చేసుకోండి - విజయాన్ని అందుకోండి" అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. 'ఈడంఎయిట్కెర్'కి చెందిన పాఠ్యప్రణాళిక అభివృద్ధికర్త జి.ఎస్.వి. దినేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యాశాలలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నీతిని తెలుసుకోండి, దేశాన్ని గురించి తెలుసుకోండి, సంస్కృతిని తెలుసుకోండని పిలుపునిచ్చారు. అలాగే, ఆయన విద్యార్థులతో కొన్ని యోగాసనాలు అభ్యాసం చేయించారు. విద్యార్థులతో స్వీయ అవగాహన ప్రశ్నావళిని పంచుకున్నారు. విద్యార్థులు ప్రతిస్పందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, మొదటి సంవత్సరం విభాగాధిపతి డాక్టర్ కె. శ్రీలత, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లే అవుట్ క్రమబద్ధీకరణ పథకంపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర -విజయనగరం :లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం అమలకు మరో రెండు నెలలు మాత్రమే గడువు ఉన్నందున ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించాలని నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ప్రణాళిక కార్యదర్శులకు ఆదేశించారు. ఈ మేరకు శనివారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర క్రమబద్ధీకరణతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారంలో కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. లేఔట్ క్రమబద్ధీకరణ పథకం అమలుకు మరో రెండు నెలలలు మాత్రమే గడువును ఉన్నందున దరఖాస్తులు త్వరితగతిన పరిష్కారం అయ్యే విధంగా చూడాలని, అలాగే లే అవుట్ క్రమబద్ధీకరణకు చొరవ చూపాలని చెప్పారు. ఆదాయ వనరులను పెంపొందించే దిశగా కృషి చేయాలని అన్నారు. అనధికార కట్టడాలను, నిర్మాణాలను ఉపేక్షించవద్దని చెప్పారు. నగరంలోని ప్రధాన రహదారులలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చిరు వ్యాపారులను క్రమబద్ధీకరించాలని చెప్పారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, టిపిఓ అప్పలరాజు పాల్గొన్నారు.

విశాలాంధ్ర విజయనగరం
పేజి : 3
ఆదివారం 31, ఆగస్టు 2025

సీతం కళాశాల ఏఐ%డ%డీఎస్ అండ్ ఎంసీఏ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా. సత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ వారి కళాశాల నుండి బాలురు, బాలికలకు క్రీడలను నిర్వహించారు . ఆ పోటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు డేటా సైన్స్ విభాగానికి చెందిన విద్యార్థులు 3వ సంవత్సరం , చివరి సంవత్సరం బాలికలు ఖో-ఖోలో మొదటి బహుమతిని పొందారు, 3వ సంవత్సరం , 4వ సంవత్సరం బాలురు వాలీబాల్లో మొదటి బహుమతిని పొందారు. ఎం సి ఏ విద్యార్థులు క్రికెట్లో 2వ స్థానం పొందారు. సత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రమణ మూర్తి విద్యార్థులు బహుమతులు సాధించినందుకు అభినందనలు తెలిపారు విభాగ అధిపతి డాక్టర్ డి. రాధ తమ విద్యార్థుల విజయం పట్ల అభినందనలు తెలిపారు. అధ్యాపక సభ్యులు విజేతలను అభినందించారు మరియు రాబోయే కార్యక్రమాలకు వారి విద్యార్థులను మరెన్నో సాధించాలనిఅభినందనలు తెలిపారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

సిఐటియు నాయకులు బలస శ్రీను

విశాలాంధ్ర-రామభద్రపురం : రాష్ట్ర ప్రభుత్వము ఈనెల ఆగస్టు 15న మహిళలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీల లో భాగంగా ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని స్థానిక సీ ఐ టి యూ నాయకులు బలస శ్రీను అన్నారు. శనివారము మండల పరిధిలో ఉన్న ఆటో డ్రైవర్లతో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వివిధ సమస్యలపై తాసిల్దార్ ఆ జు రఫీ జాన్ కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం శ్రీను మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ఎన్నికలలో ఇచ్చిన హామీ నెరవేర్చడం సంతోషమే అయినప్పటికీ ఇచ్చిన హామీ వలన ఆటో లు తిరగక డ్రైవర్లకు పూట గడవక తీవ్ర ఇబ్బందులు పడవలసి వస్తుందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో మహిళలందరూ ఉచిత బస్సులలోనే ప్రయాణిస్తున్నారే తప్ప ఆటోలపై ఏ ఒక్క మహిళ కూడా ప్రయాణం చేయడం లేదని ఆరోపించారు. ఆటో డ్రైవర్ల బాధను ముఖ్యమంత్రి అర్థం చేసుకొని తక్షణమే వారికి సంవత్సరానికి 25000 వేల రూపాయల ఆర్థిక సహాయ భృతి కల్పించి వారిని ఆ దు కోవాలని కోరారు. ఎన్నికల్లో అనేక అబద్ధపు హామీలు ఇచ్చి చంద్రబాబునాయుడు అధికారంలోకి రావడం జరిగిందని అన్నారు. జి ఓ ఎం ఎస్ 19 ప్రభుత్వము తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వము బివిఎన్ పేరుతో 106 106 జీవో 1,2 తీసుకువచ్చిందని దానివలన ఆటో డ్రైవర్లు మెడకు ఉరితాడు లాగా ఉందని దానిని కూడా కేంద్ర ప్రభుత్వము రద్దు చేయాలని కోరారు. అలాగే ఆటో డ్రైవర్ల పై వివిధ చట్టాలు తీసుకొని వచ్చి పోలీసులు వేధింపులు చేస్తున్నారని వాటన్నింటినీ కూడా తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు లోకేష్ రామకృష్ణ రాజు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నవత లోక్సభ కార్యక్రమం విజయవంతం చేయండి

రోహిత్ సంజయ్

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: సెప్టెంబర్ 2వ తేదీ నుంచి విజయనగరం రోటరీ సెంట్రల్ క్లబ్ నిర్వహిస్తున్న నవతరోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని యూత్ సర్వీస్ ఉత్సవాల డైరెక్టర్ రోహిత్ సంజయ్ విజ్ఞప్తి చేశారు. ఈ ఉత్సవాలు 2వ తేదీ పట్టణంలోని ఎస్విఎన్ హోటల్లో ప్రారంభం అవుతాయని, అనంతరం పాఠశాల కళాశాల విద్యార్థులచే గ్రూప్ డాన్స్ పోటీలు జరుగుతాయన్నారు. 3న రాజీవ్ క్రీడా మైదానంలో ఖో-ఖో, 4న కబడ్డీ, 5న పరుగు పందెం, 6న షటిల్ బ్యాడ్మింటన్, 7న ఎస్వీ ఎన్ లేక్ ప్యాలస్ లో సైన్స్ ఫెయిర్, క్విజ్ , 8న వక్తృత్వం, 9న బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్, విచిత్ర వేషధారణ పోటీలు, 10న డ్రాయింగ్ కాంపిటేషన్ , 11న చెస్, 12న పోస్టర్ డిజైనింగ్, 13న భగవద్గీత పఠన పోటీలు , 14న కేల్ పురం లో గల టర్ఫ్ ఎక్స్ లో బాక్స్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 30న జరిగే నవతరోత్సవాల ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతి ప్రధానం జరుగుతుందని వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో రోటరీ సెంట్రల్ క్లబ్ అధ్యక్షులు విజయకుమార్ అగర్వాల్, కార్యదర్శి ఉదయ్ కుమార్, ఉత్సవాల చైర్మన్ చెన్న ప్రదీప్, గ్రంధి కృష్ణ తేజ, ఆర్ శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించండి : ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞాన ప్రసాద్

విశాలాంధ్ర-బొబ్బిలి : మోటార్ సైకిల్ వాహనదారులు రోడ్డు ప్రమాదాలు నివారణకు పోలీస్ శాఖ ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీస్ శాఖ సిబ్బందికి సహకరించాలని ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞాన పసాద్ పిలుపునిచ్చారు. పట్టణ సిఐ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు రోడ్డు నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు తీసుకోవడానికి శనివారం పట్టణం దక్షిణ దేవుడు సెంటర్ వద్ద ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ ద్విచక్ర వాహనాలను తనిఖీలు నిర్వహించారు.వాహనాలకు సంబంధించిన అన్ని ద్రువపత్రాలు ఉండాలని హెల్మెట్ ధరించాలని అన్నారు.

జేఎన్టీయూజివి లో జాతీయ క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జేఎన్టీయూజివిలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శారీరక విద్య విభాగం ఆధ్వర్యంలో, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్చంద్ జయంతిని పురస్కరించుకుని పలు క్రీడా పోటీలు నిర్వహించారు.గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదాన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డా. ఆర్. రాజేశ్వర రావు, వైస్-ప్రిన్సిపాల్ డా. జి.జె. నాగరాజు అతిథులుగా హాజరై, విద్యార్థులను ప్రోత్సహించారు. విజేతలకు ట్రోఫీలు, పతకాలు, ధృవపత్రాలు అందజేశారు. ఈ సందర్భంలో డా. గొట్టిపు అప్పల నాయుడు, విశ్వవిద్యాలయ క్రీడల సమన్వయకర్త, జేఎన్టీయూజివి, విజయనగరం, మాట్లాడుతూ "క్రీడలు విద్యార్థులలో క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వం వంటి లక్షణాలను పెంచుతాయన్నారు. ఇవి ఒక మంచి ఇంజినీర్గా ఎదగడానికి, భవిష్యత్తు నాయకులుగా మారడానికి అత్యవసరమైన గుణాలు" అని అన్నారు.ఈ కార్యక్రమంలో క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఆలోవి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారిచే పూల్ క్యాంపస్ డ్రైవ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాల, గాజుల రేగ లో సెప్టెంబర్ 1న ఆలోవి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారిచే రిక్రూట్మెంట్ డ్రైవ్ నిర్వహించబడుతుందని. ఈ కంపెనీ సేల్స్ మరియు మెడికల్ పరికరాలు సర్వీస్ నకు గాను ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని. ఈ రిక్రూట్మెంట్ డ్రైవ్ కి విజయనగరం, శ్రీకాకుళం మరియు విశాఖపట్నం జిల్లా ఇంజనీరింగ్ విద్యార్థులు అర్హులు. బి. టెక్ నందు ఇ. ఇ. ఇ %డ% ఇ సి ఇ మరియు ఎమ్. బి. ఏ విద్యార్థులు అర్హులని. వీరికి వేతనం సుమారు 2.5 ఎల్ పి ఏ అని కలుపుకొని అని ఆలోవి టెక్నాలజీస్ తెలియజేశారు. ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు విజయనగరం, శ్రీకాకుళం, వైజాగ్ జిల్లా లో గల విద్యార్థులందరికీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోమని పిలుపునిచ్చారు.ఇ అవకాశాన్ని బి. టెక్ (ఇ. ఇ. ఇ, %డ% ఇ. సి. ఇ మరియు ఎమ్. బి. ఏ) విద్యార్థులు సద్వినియోగం చేసుకోమన్నారు వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు : 9926717999, 70631 11842, 99592 92427, 8328550367 విద్యార్థులు ఇ క్రింది లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ..

కోర్లాం పంచాయతీలో యూరియా పంపిణీ

విశాలాంధ్ర-మెరకముడిదాం: మండలంలో కోర్లాం పంచాయితీలో శనివారం నాడు స్థానిక తెలుగుదేశం, జనసేన పార్టీ సీనియర్ నాయకులైన బొండా సుందర్ రావు బుద్ధి శ్రీను చీపురుపల్లి శాసన సభ్యులైన కిమిడి వెంకటరావు ఆదేశాల మేరక కోర్లాం పంచాయతీ మధుర గ్రామాలైన కొత్తకర్ర సిరియాల పేట రైతులు కు 130 బస్తాలు యూరియా పంపిణీ చేయడం జరిగింది. యూరియా పంపిణీ చేయడంతో ప్రజల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జమ్ము రమేష్ జనసేన యువనాయకులు వంటల సత్తి నారాయణ జజ్జోడ సత్యనారాయణ పైల దాము, సర్పంచ్ బొడ్డే సురేష్ కుమార్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పడి మహిళ మృతి

విశాలాంధ్ర-లక్కవరపుకోట : మండలంలోని గేదెలవానిపాలెం పంచాయితీ వేచల పువానిపాలెం లో శనివారం మధ్యాహ్నం సుమారు నాలుగున్నర గంటల సమయంలో గేదెల ఈశ్వరమ్మ 36 అనే మహిళ పిడుగు పడి మృతి చెందినట్లు ఎం ఆర్ ఐ కే సన్యాసిరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు ఈశ్వరమ్మ పొలం పనుల్లో కలుపుతీస్తుండగా వర్షంతో కూడిన పిడుగులు పడడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిందని స్థానికులు, బంధువులు చూసి వెంటనే ఎస్ కోట ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యం జరుగుతుండగా మృతి చెందిందని ఆయన తెలిపారు. మృతురాల భర్త , కుటుంబ సభ్యులు శోకసంద్రంలో బోరున విలపిస్తున్నారు అని ఆయన తెలిపారు.

సుస్థిర గిరిజనాభివృద్ధికై ఐఐఆర్ఆర్ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ఐసిఏఆర్%-%ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ హైదరాబాద్ , సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మధ్య గిరిజనాభివృద్ధి కోసం అవగాహన ఒప్పందం (ఎం ఓ యు) కుదిరింది. ముఖ్యంగా దీనివల్ల గిరిజన ప్రాంతాల్లో సేంద్రీయ వరి సాగు ప్రోత్సాహం, గిరిజన రైతులకు ఆధునిక వరి సాగు సాంకేతికలపై శిక్షణ ఇనుము జింక్ అధికంగా ఉన్న వరి రకాల సాగు ద్వారా రక్తహీనత నివారణ తక్కువ జి ఐ రైస్ రకాల ద్వారా డయాబెటిక్ నివారణ తదితర అంశాలపై చర్చించారు.ఐఐఆర్ఆర్ డైరెక్టర్ డా. ఆర్. ఎం. సుందరం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రముఖ శాస్త్రవేత్తలు డా. సి. ఎన్. నీరజ, డా. అమ్తుల్ వారిస్, డా. ఏ. పి. పద్మకుమారి, డా. బి. శ్రీదేవి, డా. పాపారావు వైకుంఠపు పాల్గొన్నారు. సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ తరఫున ఆఫీసియేటింగ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్, అసోసియేట్ ప్రొఫెసర్ డా. అనిరుధ్ కుమార్ పాల్గొన్నారు.

సెప్టెంబరు 7,8 లలో 'సీటు జిల్లా మహాసభలు

విశాలాంధ్ర-రాజాం. : సిఐటియు 11వ జిల్లా మహాసభలు సెప్టెంబరు నెల 7,8 తేదీల్లో రాజాంలోని నటరాజ్ ఫంక్షన్ హాల్ లో జరుగు తాయని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహాసభల నిర్వహణకు చురుకుగా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. రెండు రోజుల కార్యక్రమాల్లో భాగంగా 7 వ తేదీన టౌన్ లో భారీ ర్యాలీ జరుగుతుంది. అనంతరం బహిరంగ సభ ఉంటున్నాయి. సమావేశానికి సుమారు 200 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి తీర్మానాలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆయనతోపాటు సిటు నాయకులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నారా లోకేష్ ని కలిసిన మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్

విశాలాంధ్ర-నెల్లిమర్ల : మాజీ ఎంపీపీ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర రావు విశాఖపట్నం లో నోవాటెల్ లో ఏయిరోస్పేస్ మానుఫ్యాక్చరింగ్ పై సిబిఐ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ లో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ని విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నెల్లిమర్ల నియోజకవర్గం టీడీపీ సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర రావు మర్యాద పూర్వకంగా కలిశారు.

చట్టాలపై అవగాహన కల్పించుకోవాలి

తిమ్మయ్యపేట న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి శారదాంబ

విశాలాంధ్ర.రాజాం: ప్రజల్లోఅవగాహనతోనే కులవివక్షత నిర్మూలించవచ్చు నని రాజాం మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి కె. శారదాంబ అన్నారు. శనివారం రాజాం మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మయ్యపేట గిరిజన గ్రామంలో మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రజల ఆలోచనలో మార్పు రావాలన్నారు. ఎస్సి, ఎస్టి లు వారి కోసం చేయబడిన చట్టాలపై సంపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలని, వారి హక్కులకు భంగం కలిగితే వాటి ద్వారా న్యాయం పొందవచ్చునని చెప్పారు. అయితే వాటిని దుర్వినియోగం చేయరాదని సూచించారు. బాల్య వివాహాలు నిరోధించాలన్నారు. వాటి వల్ల కలిగే అనర్థాల గూర్చి ప్రజలకు వివరించి చైతన్యం తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పారు. ఎస్సి, ఎస్టిలకు అవసరమైతే ఉచిత న్యాయ సహాయం కోసం న్యాయ సేవా సంస్థలను ఆశ్రయించాలని చెప్పారు. గ్రామాన్ని దత్తత తీసుకుని పలు సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సామాజిక కార్యకర్త ఎన్. వసంతరావు సేవలను కొనియాడారు. సదస్సులో మున్సిపల్ కమిషనర్ జె. రామప్పలనాయుడు, వైద్యాధికారి యు. కిరణ్, న్యాయవాదులు ఆర్. విజయకుమార్, ఆర్ సిహెచ్ జయదేవ్, ఎం.శ్రీనివాసరావు, ప్రభుత్వ న్యాయవాది పి. శ్రీనివాస్, టౌన్ ఎస్ఐ కె. శేఖర్ రావు, శానిటరీ ఇన్స్పెక్టర్ సిహెచ్. ప్రసాద్, రెడ్ క్రాస్ చైర్మన్ కె. సాయి ప్రశాంత్ కుమార్, పి. చైతన్యకుమార్, రోటరీ అధ్యక్షులు గట్టి.పాపారావు, టిటివి రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.